4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 30 ఏప్రిల్ 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# పతార లేని పాలన

'ఏం చేస్తున్నావే కోడలా అంటే పారబోసి ఎత్తుకుంటున్నా అత్తా' అన్నదట వెనుకటికి ఓ కోడలు పిల్ల. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు తీరు అందుకు భిన్నంగా ఏమీ లేదు. వరంగల్ సభలో తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్ చదివితే ప్రభుత్వ పెద్దలు తత్తరబిత్తర పడిపోతున్నారు. అన్నింట్లో సున్నా మార్కులు రావడమే అందుకు కారణం. మొదట మంత్రులు, పార్టీ నేతలు గాయి చేశారు. సర్కారు సాధించిన గొప్ప సంగతులేమిటో చెప్పలేక ఎదురుదాడితో సరిపెట్టారు. అడ్డగోలుగా విమర్శలు గుప్పించేందుకే మొగ్గు చూపారు. వారి సంగతి అలా వదిలేస్తే ఇప్పుడు స్వయంగా గుంపుమేస్త్రీ ఆత్మ సమర్థనకు దిగారు. ఆ సమర్థన సెల్ఫ్‌గోల్ లా ఉండటమే విడ్డూరం. ఏడాదిన్నర కాలంగా పథకాలకు చిత్రికలు పడుతున్నారట. సమయమంతా ప్లానింగ్‌లోనే గడిచిపోయిందట. ఇక నుంచి తడాఖా చూపిస్తారట. ఇదీ ఆయన మాటల్లోని సారాంశం. అంటే ఇప్పటిదాకా ఏమీ చేయలేదని ఒప్పుకున్నట్టే. కేసీఆర్ అంటున్నది, ప్రజలు చెవియొగ్గి వింటున్నదీ ఆ మాటే. 'శుష్కప్రియాలు, శూన్యహస్తాలు' తప్ప తమ ప్రభుత్వం సాధించిందేమీ లేదని రేవంత్ చెప్పకనే చెప్పారు. మాట మీద నిలబడటం కష్టం కానీ ఎగ్గొట్టేందుకు ఎన్నో దారులు. రాజు గారు మెచ్చుకొని ఉల్లిగడ్డ చేతుల వెట్టినట్టు శాంపిల్ పథకాలతో సరిపెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.

కేసీఆర్ పాలనా పగ్గాలు చేపట్టేనాటికి రాష్ట్రం అంధకారంలో ఉన్నది. ఎటుచూసినా అస్తవ్యస్త స్థితి. ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. ప్రతికూల శక్తులు దెబ్బతీయాలని చూస్తున్నాయి. ఆ పరిస్థితుల్లో ఆయన రాష్ట్రాన్ని స్థిరంగా వెలుగుల వైపు నడిపించారు. ప్రగతి పథంలో ప్రథమ స్థానంలో పరుగెత్తించారు. రేవంత్ బడేభాయ్ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ బీఆర్ఎస్ పాలనకు ఇచ్చిన అవార్డులు, రివార్డులే అందుకు తార్కాణం. కేసీఆర్ దూరదృష్టి, దార్శనికత, వ్యూహ చతురత, నాయకత్వ పటిమ అందుకు కారణం. నిరంతర సమాలోచనలతో రాష్ట్రానికి దశ-దిశ నిర్దేశించిన తీరు అద్వితీయం. సంపద పెంచి అందరికీ పంచిన తీరు అనన్య సామాన్యం. అన్ని సూచీల్లో రాష్ట్రం అగ్రస్థానాలకు ఎగబాకడం ఆయన పాలనా సామర్థ్యానికి నిలువెత్తు నిదర్శనం.

మామూలుగా సంసారాలు నడపడమే కష్టమంటారు. అలాంటిది సర్కారును నడపడం మామూలు విషయం కాదని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. 'కనీసం మంత్రిగా చేసిన అనుభవం కూడా లేదు రాష్ట్ర భారాన్ని ఎలా నడిపిస్తారని' పదవిలోకి వచ్చిన కొత్తలో అడిగితే 'గుంపుమేస్త్రీకి అన్నీ తెలియాలా' అని తెలివిగా సమాధానమిచ్చారు సీఎం రేవంత్. అది తప్పించుకుతిరిగే సమాధానమని ఇప్పుడు తేటతెల్లమైంది. ఏడాదిన్నర సాక్షిగా ఆయన పరిపాలనా సామర్థ్యం బట్టబయలైంది. పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించిన పళ్లెంలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పగిస్తే ఖాళీ ఖజానా చేతికిచ్చారనే కల్లబొల్లి కబుర్లతో పాలన మొదలుపెట్టారు రేవంత్. బీఆర్ఎస్ అప్పులు చేయడం తప్పని ఇల్లెక్కి కూసినోళ్లు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. గతంలోని అన్ని ప్రభుత్వాలు కలిపి చేసిన అప్పుల కంటే ఎక్కువ మొత్తంలో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేసింది. మరి ఆ అప్పును ఏ బొందలో పోశారో వారికే తెలియాలి. ఇప్పుడేమో అప్పు పుట్టడం లేదని కూడా బీద అరుపులు అరుస్తున్నారు. పతార పోగొట్టుకొని అప్పు అడిగితే ఎవరూ ఇవ్వరనే కనీస ఇంగితం గుంపుమేస్త్రీకి లేకపోతే ఎలా?

# ఐదేండ్లుంటే అదృష్టవంతులే..



బుద్ధా మురళి

**'మళ్లీ మనమే గెలుస్తాం, పదవుల కోసం తొందర వద్దు, వేచి ఉండాలని' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి పదవులపై ఆశలు పెట్టుకొన్న ఎమ్మెల్యేలకు, నాయకులకు పదే పదే ఇదే మాట చెప్తున్నారు. అద్దంకి దయాకర్ పదమూడేండ్ల పాటు నిరీక్షించిన తర్వాత శాసనమండలి సభ్యత్వం దక్కిన విషయాన్ని ప్రస్తావిస్తూ అలా ఓపికతో నిరీక్షించినవారికే పదవులు దక్కుతాయంటున్నారు.**



అధికారంలోకి వచ్చిన కొత్తలో పదేండ్లు అధికారంలో ఉంటామని చెప్పేవారు. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతూ వస్తున్నా కొద్దీ మళ్లీ మనమే గెలుస్తామనే ఉపన్యాసం మరింత ఎక్కువ సాగుతుంది. మళ్లీ గెలుస్తామని సీఎం ఎంత గట్టిగా చెప్తున్నా, ఫీల్డ్‌లో వాతావరణం బాగా తెలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ రాదని గ్రహించి మంత్రి పదవుల కోసం గట్టిగానే డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు వచ్చినప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఏ ప్రభుత్వం ఉన్నా సీఎంపై ఎవరు విమర్శ చేసినా అధికారపక్షం నుంచి మంత్రులు, శాసనసభ్యులు, నాయకులు మూకుమ్మడిగా దాడికి దిగేవారు. కానీ, రేవంత్‌ను కాంగ్రెస్ సీనియర్‌లు ఔట్ సైడర్‌గానే చూస్తున్నారు. 'ప్రభుత్వం మీద, నా మీద విమర్శలు వచ్చినా స్పందించరా? నేనే సమాధానం చెప్పుకోవాలా?' అని సమావేశాల్లో పార్టీ నాయకులను స్వయంగా ముఖ్యమంత్రి ప్రశ్నించే పరిస్థితి.

సాధారణంగా మంత్రివర్గ విస్తరణ అనే ప్రచారం జరిగినప్పుడల్లా పదవులు ఆశించేవారు విమర్శలు వినిపిస్తే విపక్షంపై మాటల యుద్ధానికి దిగేవారు. రేవంత్ పాలనలో అది కూడా కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరవుతున్నది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి వర్గ విస్తరణపై విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఢిల్లీకి సీఎం వెళ్లినప్పుడల్లా మంత్రివర్గ విస్తరణ కోసమే అని ప్రచారం సాగింది. ఉగాదికి ఖాయమని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఢిల్లీ నుంచి మాత్రం సంకేతాలు ఏమీ అందడం లేదు. కాంగ్రెస్ ఇంచార్జిల మార్పు జరుగుతోంది కానీ, మంత్రి వర్గ విస్తరణ మాత్రం జరగడం లేదు. విస్తరణ ఊహాగానాలు వచ్చినప్పుడు సీఎం దృష్టిలో పడేందుకు నాయకులు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక్కడ ఆ ప్రయత్నం కూడా ఏమీ లేదు. 'నా చేతిలో ఏమీ లేదు, నిర్ణయం తీసుకునేది హై కమాండే' అని స్వయంగా సీఎం రేవంత్ ప్రకటించారు. మంత్రివర్గంలోకి తీసుకునే అధికారం అయన చేతిలో లేనప్పుడు ఆయన్ని ప్రసన్నం చేసుకోవడం ఎందుకు? వృథా ప్రయాస అనే ఆలోచనలో నాయకులున్నారు. ఏదేని రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత గతంలో సంప్రదాయం ప్రకారం ఢిల్లీ నాయకత్వం సీఎల్‌పీ నాయకుడి పేరును మాత్రమే ప్రకటిస్తుంది. దీనికి భిన్నంగా రాష్ట్రంలో తర్వాత తొలిసారిగా సీఎల్‌పీ నాయకునిగా రేవంత్‌రెడ్డి పేరును ఎన్నికల సమయంలో ప్రకటించడంతో పాటు ఒక్కరే నిర్ణయాలు తీసుకోవడమంటూ ఉండదని, సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటారని ఢిల్లీలో వేణుగోపాల్ ప్రకటించడం విడ్డూరం. దీంతో రేవంత్‌కు ముందే బ్రేకులు వేసి సీనియర్లను సంతృప్తి పరిచారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన చాలామంది నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు బోలెడు ఆశలు పెట్టుకొన్నారు.

> కానీ, కాంగ్రెస్‌లో పరిస్థితి ఏమిటో వారికి తెలిసింది కాబట్టే ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కాదని బహిరంగంగానే శాసనసభ్యులు ఈసారి విస్తరణలో తమకు అవకాశం ఇవ్వకపోతే ఊరుకునేది లేదని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. మూడు సార్లు మూడు పార్టీలు మారిన వారికి అవకాశం ఇస్తూ కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని ఉన్నవారికి అవకాశం ఇవ్వకపోతే సహించేది లేదంటున్నారు.

పదేండ్లు విపక్షంలో ఉండి కష్టపడితే తమను పక్కన పెట్టి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి దూరేవారికి ఎలా అవకాశం ఇస్తారని శాసనసభ్యులు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి కాకపోతే వచ్చేసారి అవకాశం ఉంటుందిలే అనే నమ్మకం ఉంటే మరో రకంగా ఉండేవారు. ఈ ఐదేండ్లు పూర్తికావచ్చు కానీ, మళ్లీ వస్తామనే నమ్మకం వారిలో కనిపించడం లేదు.

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో వరుసగా ఐదేండ్ల పాటు కరువు కాటకాలు, తెలంగాణ ఉద్యమం, విద్యుత్ ఉద్యమం-కాల్పులు వంటి తీవ్ర వ్యతిరేకతతో 2004లో బాబు ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. 2004 నుంచి 2009 వరకు కరువు లేదు, మంచి వర్షాలు, అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారు. బాబు హయాంలో రూ.150 పింఛన్ వైఎస్ఆర్ హయాంలో అడిగినవారికి లేదనకుండా పింఛన్ రూ.వెయ్యికి పెంచారు. ఫీజు రీ యింబర్స్‌మెంట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తే, ప్రకృతి కరుణించి, మంచి వర్షాలు కురిస్తే కాంగ్రెస్‌కు బొటాబొటీనా 156 సీట్లు మాత్రమే వచ్చాయి. సాధారణ మెజారిటీకి ఎనిమిది సీట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. 2004లో 185 సీట్లు వస్తే అన్ని సంక్షేమ పథకాలు అమలుచేశాక 156 మాత్రమే వచ్చాయి. అదే టీఆర్ఎస్ విషయానికి వస్తే ఉద్యమపార్టీగా 2014లో 63 సీట్లు వచ్చాయి. మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం మూడు సీట్లు ఎక్కువ వచ్చాయి. ఐదేండ్ల పాలనలో రైతుబంధు, కల్యాణలక్ష్మి, రెండు వేల రూపాయల పింఛన్ వంటి పథకాలు, విద్యుత్ సంక్షోభ దశ నుంచి 24 గంటల విద్యుత్తు వరకు అభివృద్ధి పరంగా ఫలితంగా ఐదేళ్ల పాలన తరువాత 88 సీట్లలో విజయం సాధించారు.

ఇక ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోకి వస్తే అద్భుతాలు ఏం చేశారని మళ్లీ అధికారంలోకి వస్తారు. కొత్త పథకాల అమలు మాట దేవుడెరుగు గతంలో అమలుచేసిన పథకాలకే దిక్కులేదు. తులం బంగారం ఊసెత్తడం లేదు. రుణమాఫీ కొందరికే అమలు, రైతుబంధు జాడలేదు. దివాళా తీశామని ప్రతి సమావేశంలో జాతీయగీతంలా దివాళా గీతం ఆలపిస్తున్నారు. గత ప్రభుత్వం కన్నా అద్భుత పథకాలు అమలుచేసి, అద్భుతమైన ప్రగతి సాధించి ఉంటే మళ్లీ గెలుస్తారని చెప్పుకోవడానికి అవకాశం ఉండేది. దివాళా తీశాం, ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నాం అని ఒకవైపు వాళ్లే చెప్తూ మళ్లీ వస్తాం అప్పుడు పదవులు ఇస్తాం అంటే ప్రజల మాట అటుంచి సొంత పార్టీ వాళ్లే నమ్మడం లేదు.

ఏడాదికో సారి సీఎంలను మార్చడం వల్ల 83లో ఎన్టీఆర్ పాతుకుపోవడానికి అవకాశం ఇచ్చామని కాంగ్రెస్ భావించడం వల్ల ఆ తర్వాత సీఎంలను మార్చలేదు. వైఎస్ఆర్ మరణంతో మార్పు అనివార్యమైంది. మహా అయితే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండవచ్చు కానీ, మరోసారి గెలిచే అవకాశాలున్నాయి అని పదవులు ఆశిస్తున్న వాళ్లే నమ్మడం లేదు.



# భరోసా ఇచ్చిన బహిరంగ సభ

**'కేసీఆర్ ప్రసంగం చాలా బాగుంది'.. ఇది రజతోత్సవ సభ ముగిసిన వెంటనే ఏపీలోని కుప్పం నుంచి వెంకటేశ్వర్లు అనే మిత్రుడి నుంచి వచ్చిన మెసేజ్.**

'కేసీఆర్ వంటి నాయకుడు మాకుంటే బాగుండు' అని ఆంధ్రా మిత్రులు అంటుంటారు. 'అనతికాలంలోనే కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టు సముదాయాన్ని కట్టడమైనా, యాదగిరి ఆలయాన్ని పునర్‌నిర్మించడమైనా, సచివాలయాన్ని గర్వకారణంగా తీర్చిదిద్దడమైనా అది కేసీఆర్‌కే సాధ్యం' అని ప్రశంసిస్తుంటారు. ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలు వచ్చినప్పుడు వారు ఆశ్చర్యపోయారు. ఏదో రాజకీయం కోసం విమర్శలు చేయడం పక్కనపెడితే కేసీఆర్ రెండు పర్యాయాల పాలనలో అనేక అద్భుతాలు సృష్టించారని, రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని ఆయన ప్రత్యర్థులు కూడా వ్యక్తిగత సంభాషణల్లో అంగీకరిస్తారు. అందుకే కేసీఆర్ సభ లేదా ప్రెస్ కాన్ఫరెన్స్ ఉందంటే చాలు, తెలంగాణలోనే కాదు, ఆంధ్రలో కూడా అనేక మంది ఆసక్తిగా టీవీలో చూస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఏ నాయకుడిపై లేని ఆసక్తి కేసీఆర్‌పై ఉంటుంది.

ఎల్కతుర్తి సభ కూడా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మళ్లీ ఉద్యమకాలాన్ని గుర్తుచేసింది. ఈ సభ జరగడానికి ముందు రెండు వారాల పాటు ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి నేను తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాలలో తిరిగాను. ప్రతిచోటా కేసీఆర్ పట్ల జనం ఆశగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తమను తప్పుడు వాగ్దానాలతో ఘోరంగా మోసం చేసిందని ప్రజలు వాపోతున్నారు. హామీలు అమలుచేయకపోవడం ఒక్కటే కాదు, గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను నిలిపివేయడం వారిని ఆగ్రహానికి గురిచేస్తున్నది. 'ఏం చేసింద్రు, నిండా మోసం చేసింద్రు. రుణమాఫీ కాకపాయె, రైతు బంధు కూడా ఇస్తలేరాయె' అని మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం అవుడ గ్రామానికి చెందిన రాజన్న అన్నడు. 'నేను మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన. కానీ, ఇప్పుడు కేసీఆర్ సభకు జనం తరలిపోతుంటే, సహాయం చేస్తున్న' అని ఒక గ్రామస్థుడు చెప్పిండు. మహబూబ్‌నగర్ కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామస్థుడు కురుమ మల్లన్న గొర్రెల కాపరి. 'గొల్ల కురుమలను తాత ముత్తాతల కాన్నుంచి ఎవడు పట్టించుకున్నడు. ఏ సర్కారు నుంచి ఏం అందలేదు. గొర్లిచ్చినా, చెర్ల చాపలు ఏసినా అది కేసీఆర్ చేసిందే. దేశంల ఎక్కడన్న గింత చేసింద్రా' అని చెప్తూనే ఉన్నడు. 'కాంగ్రెస్ వచ్చినంక అన్ని బంద్ పెట్టె' అని ఆయన అన్నడు. ఆందోల్ నియోజకవర్గం డాకూర్ గ్రామంలో భూమక్క 'కల్యాణలక్ష్మి ఇస్తలేరు, తులం బంగారం ఎక్కడ. కేసీఆర్ సార్ ప్రతి ఒక్కటి పట్టించుకునేటోడు. మొదట్ల కల్యాణలక్ష్మి పెండ్లిపిల్లకు ఇద్దురు. దీంతో మొగడు పైసలు ఇయ్యాల్నని లొల్లి. అది తెలుసుకొని పేదోళ్లు ఆగం కావద్దని పైసలు పిల్ల తల్లి పేర మీద ఇచ్చుడు పెట్టిండు' అని వివరంగా చెప్పింది. జనాన్ని కదిలిస్తే చాలు, 'కేసీఆర్ పాలన ఎంతో మంచిగుండె' అంటున్నరు. జనాన్ని కేసీఆర్ సభకు పోతరా అని అడిగితే పిల్లలైతే పోతమని అన్నరు. కొందరు మాత్రం ఎండలకు ఆరోగ్యం బాగాలేదు బిడ్డా, కని సభ మంచిగ జరగాలని కోరుకుంటున్నమని చెప్పిర్రు. ఒకాయనైతే సార్ సల్లంగుండాలె అని రెండు చేతులు జోడించిండు.

> హైదరాబాద్ బస్తీల నుంచి కూడా జనం ఎల్కతుర్తి సభకు భారీగా హాజరుకావడం గమనించవలసిన విషయం. గత ఎన్నికల్లో రాజధాని నగరం కేసీఆర్‌కు హారతి పట్టింది. ఇప్పటికీ ఇక్కడి ప్రజల్లో ఆ అభిమానం చెక్కు చెదరలేదు. బస్తీలలో జనాన్ని కదిలించి చూశాను. వారిలో తీవ్ర అసంతృప్తి, నైరాశ్యం కనిపిస్తున్నది. ఒక్కసారిగా నరకంలోకి జారిపడినట్టున్నదని ఒకింత విద్యావంతుడైన యువకుడు అన్నాడు. కేసీఆర్ పాలనలో ఒక్కనాడు కరెంటు కోత లేదు. కానీ, ఇప్పుడు కరెంటు లేదు. బస్తీ దవాఖానలు సరిగ్గా నడుస్తలేవని వారి బాధలు చెప్తున్నరు. కేసీఆర్ పాలనలో యువతలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బాగా పెరిగింది. తెలంగాణ వచ్చింది, మన బతుకులు మారాయనుకున్నరు. కానీ, ఒక్కసారిగా పరిస్థితులు మారడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నరు. రియల్ ఎస్టేట్ కుప్పకూలడాన్ని చాలామంది ఉదాహరణగా చెప్తున్నారు. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు కూడా ఆగిపోయాయి కానీ, ఇప్పుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారులూ ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఒక బస్తీలో పెద్దమనిషి అన్నడు. హైదరాబాద్ బస్తీల్లో, జిల్లాల్లోని గ్రామాల్లో తిరిగినప్పుడు జనం కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగి, బహిరంగ సభ పెట్టడం పట్ల సంతోషంగా ఉన్నరని తెలిసిపోయింది.

నేను ఊహించినట్టుగానే, కేసీఆర్ సభకు ఎక్కువగా 20 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సు వారు వచ్చారు. ఇందులో కొందరు యువప్రాయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు. కాగా, అనేక మంది కౌమార దశ నుంచి కేసీఆర్ పాలన చూసినవారు. కేసీఆర్ పాలన వల్ల లబ్ధి పొందిన పేద కుటుంబాల నుంచి వచ్చినవారు. కేసీఆర్ నీళ్లిచ్చిండు, చెరువులు నింపిండు. వీళ్లకు నల్ల నీళ్ళు ఇయ్యడం కూడా చాతనైతలేదని ఒక పేద యువకుడు ఆగ్రహంగా అన్నడు. అందుకనే కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టగానే 'సీఎం సీఎం' అనే నినాదాలు మిన్నుముట్టాయి. కేసీఆర్ మాటలకు ఊర్రూతలూగిందీ యువకులే. తెలంగాణ జెండా పట్టుకోవడానికి ఇప్పుడు యువకులే ముందుకొస్తుండటం ఆహ్వానించదగిన పరిణామం.



గోసుల శ్రీనివాస్ యాదవ్

కేసీఆర్ ప్రసంగం ప్రజలకు హత్తుకున్నది. తెలంగాణ తన కండ్ల ముందే తెర్లయిపోవడాన్ని చూసి కేసీఆర్ బాధపడటం ప్రజలకు కూడా ఆవేదన కలిగించింది. ఇంకో మూడేండ్లు భరిద్దామని, తర్వాత మనదే అధికారమని కేసీఆర్ చెప్పడంతో ప్రజలకు ఊరట లభించింది. ఆవేదనతో ఉన్న జనానికి కేసీఆర్ మాటలు ధైర్యాన్నిచ్చాయి. ఆ ధైర్యాన్నివ్వడమే నాయకుడి లక్షణం.

(వ్యాసకర్త: టీ కేసీఆర్ సెంటర్)

# వక్ఫ్ చట్టం.. భిన్న ఆలోచనలు



జీవీ శ్రీ హరీశ్ రాజు

**దేశంలో ముస్లిం సమాజానికి చెందిన ధార్మిక, సాంస్కృతిక, విద్యాసంస్థల నిర్వహణలో 'వక్ఫ్ బోర్డు' కీలక పాత్ర పోషిస్తుంది. స్వాతంత్ర్యం నుంచి ఇటీవలి '2025-వక్ఫ్ చట్టం' వరకు ఈ సంస్థ ఎన్నో మార్పులు, పలు అభివృద్ధి దశలను చవిచూసింది.**

మతపరమైన, సామాజిక, ఆర్థిక ప్రాముఖ్యం కలిగిన వక్ఫ్ ఆస్తులను నియంత్రించడానికి, రక్షించడానికి భారత ప్రభుత్వం కృషి చేస్తున్నది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు 195 4- వక్ఫ్ చట్టం పునాది వేసింది. కాలక్రమేణా, పాలనను మెరుగుపరచడానికి, దుర్వినియోగాన్ని నిరోధించడానికి చట్టాలు నవీకరించబడినాయి. వక్ఫ్ సవరణ బిల్లు - 2025 పారదర్శకతను పెంచడం, నిర్వహణను బలోపేతం చేయడం, వక్ఫ్ ఆస్తులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. దీన్ని ఉమీద్ చట్టం అని పిలుస్తారు.

1995 చట్టం స్థానంలోకి ప్రస్తుత ఉమీద్ వక్ఫ్ చట్టం వస్తుంది. కేంద్ర న్యాయమంత్రి కిరెన్ రిజిజు చెప్పినట్టుగా మెరుగైన పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తూ పేరు మార్చబడింది. ఇస్లాం మతంలో వక్ఫ్ అంటే 'ధార్మిక ప్రయోజనాల కోసం దానం చేసిన ఆస్తి' అని అర్థం. ఇదొక నిర్దిష్ట ప్రయోజనం కోసం (సామాజిక సేవ, విద్య, వైద్యం మొదలైనవి) దేవునికి అంకితం చేయబడిన ఆస్తి. ఈ ఆస్తిని అమ్మడం లేదా బదిలీ చేయడం సాధ్యం కాదు. దాని ఆదాయం నిర్దిష్ట ధార్మిక లేదా సామాజిక ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. మతపరమైన ప్రయోజనాల కోసం శాశ్వతంగా భూములను ఇవ్వాలనుకునే లేదా దానం చేయాలనుకునే వారిని వకీఫ్ అంటారు. ఈ సమష్టి విరాళాలను వక్ఫ్ బోర్డు అని పిలిచే ఒకే సంస్థ కింద ఉంచుతారు. ముతవలి నేతృత్వంలోని దానం చేసిన భూములను ఈ వక్ఫ్ బోర్డు నిర్వహిస్తుంది.

వక్ఫ్ బోర్డులపై విమర్శలు ఎందుకున్నాయంటే... వక్ఫ్ చట్టం, ట్రస్ట్ చట్టాల మధ్య వ్యత్యాసం ఉన్నది. ట్రస్ట్ చట్టం తప్పనిసరికాదు, ప్రైవేటు ఉపయోగం కోసమే ఉద్దేశించబడినది. అయితే, వక్ఫ్ చట్టం శాశ్వతమైనది, దాతృత్వమైనది. 1913, 1923, 1954, 1955లలో చట్టాలు జరిగాయి. పార్లమెంటరీ ప్యానెల్ ప్రకారం వక్ఫ్ దేశంలో రక్షణ, రైల్వేల తర్వాత మూడవ అతిపెద్ద భూ యజమాని. దీనికి 9.4 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి , 8.4 లక్షల ఎకరాల స్థిరాస్తులున్నాయి. దీనికి కేంద్ర స్థాయిలో ఒక ప్రధాన బోర్డు ఉండగా, రాష్ట్ర స్థాయిలో 32 బోర్డులున్నాయి. 2006 రాజేందర్ సచార్ నేతృత్వంలోని కమిటీ వక్ఫ్‌పై ఒక ప్రత్యేక అధ్యాయాన్ని రాసి వక్ఫ్ చట్టంలోని దుష్ప్రభావాలను, ప్రధానంగా ఈ వక్ఫ్ ఆస్తులను తమ ప్రైవేటు ఉపయోగం కోసం ఉపయోగిస్తున్న ముతవలిల అవినీతి, భూ దోపిడీ, భూముల ఆక్రమణలను స్పష్టంగా పేర్కొన్నది. వక్ఫ్ ఆస్తులను సరిగ్గా ఉపయోగించుకుంటే రూ.12,000 కోట్ల జీవీఏ (స్థూల విలువ) సృష్టించబడి ఉండేదని,






మైనారిటీ వర్గాలలో, ముఖ్యంగా ముస్లింలలో పేదరికాన్ని తొలగించవచ్చని, కానీ, అది రూ.163 కోట్లను మాత్రమే సృష్టించిందని పేర్కొన్నది. దేశంలోని ఏ కోర్టుకు వక్ఫ్ జవాబుదారీగా ఉండదు. వక్ఫ్ బోర్డుల్లో కొన్ని ప్రధాన సంస్కరణలు కూడా ఉండాలని సచార్ పేర్కొన్నారు.

2025 చట్టంలో ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి. గతంలో వక్ఫ్‌ను డిక్లరేషన్ లేదా ఎండోమెంట్ (వక్ఫ్- అలాల్- అవులాద్) ద్వారా ఏర్పాటు చేయవచ్చు. గతంలో వక్ఫ్ ఆస్తిని విచారించి నిర్ణయించే అధికారం వక్ఫ్ బోర్డు కలిగి ఉన్నది. వక్ఫ్ సర్వేలు నిర్వహించడానికి సర్వే కమిషనర్లు, అదనపు కమిషనర్లు నియమించబడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వక్ఫ్ బోర్డులకు సలహా ఇవ్వడానికి కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేసింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యులందరూ ముస్లింలుగా ఉండాలి, కనీసం ఇద్దరు మహిళా సభ్యులు కూడా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడైనా వక్ఫ్ ఖతాలను ఆడిట్ చేయవచ్చు. సున్నీ, షియా వర్గాలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులున్నా ట్రిబ్యునల్ నిర్ణయం అంతిమమైనది. కోర్టులలో దాని నిర్ణయాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు నిషేధించబడ్డాయి. ఇప్పుడు కొత్త ఉమీద్ చట్టం పన్ను పర్యవేక్షణ, న్యాయ పర్యవేక్షణ, ప్రభుత్వ పర్యవేక్షణను మార్చింది. దాతలు కనీసం ఐదేండ్లు ముస్లింలను ఆదరిస్తూ ఉండాలి, ఆస్తిని కలిగి ఉండాలి. వక్ఫ్‌గా గుర్తించబడిన ఏదైనా ప్రభుత్వ ఆస్తి వక్ఫ్‌గా నిలిచిపోతుంది. యాజమాన్య వివాదాలను కలెక్టర్ పరిష్కరిస్తారు, అతను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తాడు. రాష్ట్ర రెవెన్యూ చట్టం ప్రకారం సర్వేలు నిర్వహించడానికి, పెండింగ్‌లో ఉన్న సర్వేలు ఆదేశించడానికి కలెక్టర్లకు అధికారం ఉంటుంది. కొత్తగా సృష్టించబడిన వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను చేర్చవచ్చు, బోర్డును మార్చవచ్చు. బోహ్రా ఆగాఖానీ కమ్యూనిటీల నుంచి ఒక్కొక్క సభ్యునికి సమాన స్థలాన్నిస్తుంది (రాష్ట్రంలో వక్ఫ్ ఉంటే) ట్రిబ్యునల్ స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

ఇప్పుడు వక్ఫ్ మౌఖిక రూపంలో కాకుండా డాక్యుమెంట్ రూపంలో చేయాలి కానీ స్వాతంత్ర్యం నుంచి వక్ఫ్ మౌఖిక రూపంలో ఉంటూ వచ్చింది. ల్యాండ్ సర్వేయర్‌గా జిల్లా కలెక్టర్‌ను కంపోజ్ చేయడమనేది ప్రభుత్వం ముస్లింల వ్యక్తిగత చట్టాలలోకి ప్రవేశించడం లాంటిది. ఇది ప్రధానంగా షరియా ద్వారా నిర్వహించబడుతుంది. 6 నెలల్లో పోర్టల్ నిర్వహణ, భూముల గురించి డేటా, వారసత్వం.. మొదలైనవి నిర్వహించడం చాలా కష్టమైన పని. కొంత మంది విద్యావేత్తలు కేంద్రం వక్ఫ్ ప్రధాన భూములపై దృష్టిపెట్టిందని విమర్శిస్తున్నారు. అయితే ఉమీద్ చట్టంలోని కొన్ని చర్యలను ముస్లిం సమాజం కూడా స్వాగతిస్తున్నది. మహిళా ముస్లింలతో బోర్డు పునఃరూపకల్పనను నల్సార్ మాజీ వైస్ చాన్స్‌లర్ ముస్తఫా స్వాగతించారు. రికార్డులు వక్ఫ్ భూముల డిజిటలైజేషన్‌ను అంగీకరించారు. కానీ 6 నెలలు చాలా తక్కువని అతను భావించినట్టుగా ముస్లిం సమాజం, ప్రభుత్వం ఎక్కడ ఎప్పుడు సమస్య తలెత్తినా చేతులు కలిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కూడా ప్రభుత్వానికి ఆయన సూచిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్టుగా భారతదేశం గొప్ప వైవిధ్యానికి నిలయం. దీనిలో ప్రజలు చాలా విభిన్నమైన, రంగురంగుల దేశాన్ని రూపొందిస్తారు. ఈ కాలంలో ప్రతి అంశం మారుతున్నది. వక్ఫ్ బోర్డు కూడా దాని ఆస్తులను ఆధునీకరించి, హేతుబద్ధీకరించాలి. దాని సభ్యుల శ్రేయస్సు కోసం ఉపయోగించాలి. దీనిని ప్రత్యర్థి వాదానికి అవకాశంగా తీసుకోవాలి.

(వ్యాసకర్త: ఢిల్లీ యూనివర్సిటీ)





# తేడా తెలియదా?



**ఆపిల్ కంపెనీ తన ఐ ఫోన్ల అసెంబ్లింగ్(కూర్పు) యూనిట్‌ను మాత్రమే చైనా నుంచి భారత్‌కు తరలిస్తున్నట్టు ప్రకటించింది. కానీ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాత్రం ఇకపై భారత్‌లో ఐ ఫోన్లు తయారవుతాయని ప్రచారం చేస్తున్నారు. మేక్ ఇన్ ఇండియాకు, అసెంబుల్డ్ ఇన్ ఇండియాకు ఉన్న తేడా ఆయనకు తెలియదా?**

**- సాకేత్ గోఖలే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ**